# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు 10 రూపాయలు తగ్గించింది.
- ❖ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.
- ❖ ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువుల పట్ల మక్కువ చూపి “ఆత్మ నిర్భర్ భారత్” వైపు అడుగులు వేయాలని కేంద్ర ఖాదీ గ్రామ పరిశ్రమల కమిషన్ (కేవీఐసి) ఛైర్మన్ మనోజ్ కుమార్ కోరారు.
- ❖ మర్కాపురం బస్సు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

===================

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు 10 రూపాయలు తగ్గించింది. ఇది తక్షణమే అమలయ్యేలా నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం, ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థలో తలెత్తిన అంతరాయాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు గత నెల రోజుల్లోనే బ్యారెల్‌కు సుమారు 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు పెరిగాయి. కేవలం నాలుగు వారాల్లోనే దాదాపు 75 శాతం మేరకు ధరలు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ... కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సామాన్య ప్రజలకు ఊరటనిస్తుందన్నారు.

===================

ఆదర్శప్రాయమైన శ్రీ రాముని జీవితం అందరికీ మార్గదర్శకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని రాజమహేంద్రవరం, నిడదవోలు రామాలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజక వర్గం ఉనకరమిల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కందుల దుర్గేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం

కృషి చేస్తోందన్నారు. అలాగే స్థానిక రామాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని, గోదావరి పుష్కరాల నాటికి ఆ ఆలయాలు సరికొత్త రూపు సంతరించుకుంటాయన్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ద్వారా కామన్ గుడ్ ఫండ్ కింద పురాతన శివాలయాల అభివృద్ధికి నిధులు కోరామన్నారు. త్వరలోనే సంబంధిత నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. రాబోయే 3 ఏళ్లలో నిడదవోలు నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే శ్రీరామనవమి నాటికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. శ్రీ రాముని స్ఫూర్తిగా తీసుకొని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

===================

ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువుల పట్ల మక్కువ చూపి ఆత్మ నిర్భర్ భారత్ వైపు అడుగులు వేయాలని కేంద్ర ఖాదీ గ్రామ పరిశ్రమల కమిషన్ (కేవీఐసి) ఛైర్మన్ మనోజ్ కుమార్ తెలిపారు. అనంతపురంలో ఖాదీ గ్రామ పరిశ్రమల కమిషన్ (KVIC) ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన “మిషన్ రోజ్ ఘార్” కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఖాదీ గ్రామ పరిశ్రమల కమిషన్ (KVIC) కార్యాలయంలో వివిధ చేతి వృత్తులల్లో శిక్షణ పూర్తి చేసిన లబ్ధిదారులకు ఆయన పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... “వోకల్ ఫర్ లోకల్”, “ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్”, “వికసిత్ భారత్” సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉద్యోగాల కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... వారి ఇంటి వద్దే ఉపాధి పొందేలా పటిష్టమైన వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూపొందించారని మనోజ్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

విరామం

===================

ఆరోగ్య సంరక్షణలో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేక డిజిటల్ హెల్త్ పోర్టల్ ను రూపొందించామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడించింది. దేశంలోనే తొలిసారిగా 13 నుండి 19 సంవత్సరాల మధ్య ఉన్న విద్యార్థుల కోసం “ఆంధ్రప్రదేశ్ స్కూల్ హెల్త్ అండ్ వెల్‌నెస్” ప్రోగ్రాం కింద “ఏపీఎస్ హెచ్ డబ్ల్యూపీ” పేరుతో డిజిటల్ పోర్టల్ ను రూపొందించింది. బాలబాలికలు ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండడం, లింగ సమానత్వం, హెచ్ఐవీ, రోడ్డు ప్రమాదాల బారినపడకుండా ఉండడం, ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాల సురక్షిత వినియోగం వంటి అంశాలపై స్వీయ విధానం (సెల్ఫ్ లెర్నింగ్)లో నేర్చుకునేలా “ఏపీఎస్ హెచ్ డబ్ల్యూపీ” పోర్టల్‌ను అందుబాటులోనికి తీసుకువచ్చినట్లు ఆ శాఖ వెల్లడించిచింది. ఆరోగ్య సంరక్షణ, శారీరక మార్పులు, మానసిక వికాసం, హెచ్ఐవీ వంటి అంశాలపై పోర్టల్ లో పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపింది.

===================

మర్కాపురం బస్సు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బస్సు ప్రమాద ఘటనలో గాయపడి ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను స్థానిక శాసన సభ్యులతో కలసి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి క్షతగాత్రుల ఆరోగ్యస్థితి, వారికి అందిస్తున్న వైద్యసేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి విలేకరులతో మాట్లాడుతూ... బస్సు ప్రమాదంలో గాయపడిన

వారిలో 16 మంది ఒంగోలులో, 12 మంది మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వీరికి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని త్వరలోనే అందిస్తామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

అదే విధంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వారికి పూర్తిగా నయం అయ్యే వరకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని తెలిపారు.

==================

పూరి - తిరుపతి రైలులో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి, మత్తు చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల జిల్లా డీఎస్పీ జగదీష్ నాయక్ తెలిపారు. బాపట్ల పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పూరి - తిరుపతి రైలులో బాపట్ల - చీరాల మధ్య ఈగల్, RPF, GRP, పోలీసులందరు తనిఖీ చేపట్టామన్నారు. రైలులో ఒడిశా నుంచి వస్తున్న పూనా రెడ్డి, గౌతమ్ మాలిక్, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రవికుమార్ లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితుల నుండి 8 కిలోల గంజాయి, 70 మత్తు చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మత్తుపదార్ధాలను నిందితులు ఒంగోలు, నెల్లూరు నగరాలలో విక్రయించడానికి అక్రమ రవాణా చేస్తున్నారని, నిందితులపై GRP పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయిని పూర్తిగా నిర్మూలించడానికి కఠినమైన చర్యలు చేపడుతున్నట్లు DSP జగదీష్ నాయక్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==================

రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయచంద్ర తెలిపారు. పార్వతీపురం నుంచి వల్లరిగుడబ వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నాబార్డు ఆర్‌డీఎఫ్ నిధుల కింద 2 కోట్ల రూపాయలతో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

==================
==================